# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

- రైతులతో పెట్టుకున్నోడు నాశనమే..
- పాత పద్ధతి తెస్తామంటున్న కాంగ్రెసోళ్లకు వాత పెడ్తాం
- రైతుభరోసాపై మాట మార్చిన టీపీసీసీ చీఫ్‌పై మండిపాటు
- ధరణితోనే భూ పంచాయితీల పీడ విరగడైంది..
- కేసీఆర్ ఉంటేనే మా భూములకు భద్రత.. భరోసా

ధరణిని తొలగిస్తామన్న

# హస్తం.. మసిచేస్తం

**ధరణి పోర్టల్‌ను** తొలగిస్తామంటున్న కాంగ్రెసోళ్లపై అన్నదాతల ఆగ్రహం రోజురోజుకూ పెరుగుతున్నది. అధికారం కోసం పూటకో మాట మాట్లాడుతూ రైతుల జీవితాలతో ఆడుకోవాలని చూస్తున్న హస్తం పార్టీని మసిచేస్తామని మండిపడుతున్నారు. పాత పద్ధతి తెచ్చి భూ రికార్డులను తారుమారు చేసి రైతుల మధ్య పంచాయితీలు పెట్టాలని చూస్తున్న కాంగ్రెసోళ్లకు కర్రు కాల్చి వాత పెడ్తామని హెచ్చరిస్తున్నారు. రైతుల శ్రేయస్సు కోసం సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్, 24గంటల కరెంటు సరఫరా మీద అడ్డగోలు వాదనలు చేసిన కాంగ్రెసోళ్లు.. తాజాగా రైతు భరోసాపై రోజుకో మాట మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అధికారంలోకి రాకముందే మాట మారుస్తున్న కాంగ్రెసోళ్లను నమ్మేది లేదని స్పష్టం చేస్తున్నారు. రైతు సంక్షేమం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని, ఆయన ఉంటేనే మా భూములకు భద్రత, భరోసా అంటూ ధీమా వ్యక్తంచేస్తున్నారు.



## 24 గంటల కరెంటుతోనే రైతులకు కష్టాలు దూరం

**రైతులకు** 24గంటల కరెంట్‌ను తెలంగాణ ఇస్తున్నప్పటి నుంచి మొత్తం పంట వస్తున్నది. ప్రతి గుంటకూ నీరందుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అష్టకష్టాలు పడ్డారు. కరెంట్ పోతే రానే రాకపోతుండె. పారిన మడే పారుతుండే. ఎండిన మడి ఎండిపోతుండే. కేసీఆర్ రైతుల కోసం 24గంటల ఉచిత కరెంట్ ఇవ్వడంతో కాస్త సేద తీరుతున్నాం. ఇప్పుడు రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంటు చాలంటే రైతులు వ్యవసాయం చేయాలా? మానుకోవాలా ? 10 హెచ్‌పీ మోటర్లతో సాగు చేస్తే ఇల్లు, నీళ్లు గుల్ల అవుతాయి.

**- శంకర్, రైతు, భిక్కనూరు మండలం**

## ధరణితోనే రైతులకు మేలు



సీఎం కేసీఆర్ రైతుల మేలుకోరే మనిషి. అన్ని విధాలా ఆలోచించే ధరణి తీసుకువచ్చిండు. ఏ ఒక్కరికీ అన్యాయం, నష్టం జరగకుండా ఉండాలని ముందు చూపుతోనే ధరణి పోర్టల్ తీసుకువచ్చిండు. దీంతో ఏ ఒక్క రైతు నష్టపోలేదు. ధరణి లేకముందు రైతులు ఎంతో ఇబ్బంది పడ్డారు. రిజిస్ట్రేషన్ కోసం రైతులంతా ఆఫీసుల చుట్టూ తిరిగెటోళ్లు. ఇప్పుడు మీ సేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు పెడితే డైరెక్ట్ పనే అయిపోతుంది. ధరణితో రైతులంతా సంతోషంగా ఉన్నారు.

**- బోందయాల శంకర్, రైతు, చిన్నమల్లారెడ్డి**

## ధరణి రద్దు చేస్తే రైతులు ఆగమే



సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన ధరణి భూములకు పూర్తి రక్షణ కల్పిస్తుంది. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే ధరణి తీసేసి రైతుల్ని బంగాళాఖాతంలో కలుపుదామని చూస్తున్నారు. ధరణి తీసేస్తే రైతుల బతుకులు మళ్లీ ఆగమైతాయి. ఇప్పుడు మా భూములు ఎక్కడికీ పోవనే ధైర్యంతో ఉన్నాం. సీఎం కేసీఆర్ పెట్టిన ధరణి ఎప్పటికీ ఉండాల్సిందే.

**- మీసాల రాజిరెడ్డి, రైతు, చిన్నమల్లారెడ్డి**



## రైతులకు వరం ధరణి

ధరణితో రైతులకు మేలు జరుగుతుంది. తెలంగాణ రాకముందు ఉన్న పట్వారీ వ్యవస్థతో అనేక మంది రైతులు ఇబ్బంది పడ్డారు. గతంలో భూమి పహాణీ కావాలంటే తహసీల్ ఆఫీసు చుట్టూ చెప్పులరిగేలా తిరిగెటోళ్లం. పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు పంట నష్టం జరిగినా, భూమిని రికార్డుకు ఎక్కియ్యాలన్నా పైసలు తీసుకునేవారు. భూమికొని పట్టా చేసుకున్న తర్వాత దానిని రికార్డుల్లో ఎక్కించి మ్యుటేషన్ చేయించాలన్నా, పట్టాదారు పాసుబుక్కు తీసుకోవాలన్నా తహసీల్ ఆఫీసు చుట్టూ తిరగాల్సి వచ్చేది. ధరణితో అప్పటికప్పుడే పనులు అయిపోతున్నాయి.

**- మోహన్ స్వామి, రైతు, చిన్నమల్లారెడ్డి**



## ధరణితోనే భూములకు భద్రత

రాజంపేట్, నవంబర్ 26: ధరణితోనే రైతుల భూములు భద్రంగా ఉంటున్నాయి. ఎవ్వరైనా సరే పట్టాదారుని అనుమతి లేకుండా భూ బదలాయింపు చేయడానికి వీలు లేకుండా పటిష్ట భద్రత కల్పించారు. ఏ అధికారులు సైతం అవకతవకలు చేయడానికి వీలులేదు. ధరణి రైతులకు భరోసా ఇచ్చింది. సీఎం కేసీఆరే మళ్లీ రావాలి.

**- నాయిని సంజీవ్,రైతు, ఆరెపల్లి**



## ధరణి తీసేస్తే దళారీ వ్యవస్థ వస్తుంది

పంట భూముల్లో పందికొక్కుల్లా పడి దోచుకునేటోళ్లు.. రైతులను నట్టేట ముంచెటోళ్లను మళ్లీ తీసుకురావాలని హస్తం పార్టీ కుట్ర చేస్తున్నది. ధరణి తీసేసి వీఆర్వోల చేతుల్లో భూ రికార్డులు పెట్టి లంచాలు వసూలు చేసే దళారుల దందాను తీసుకురావాలని చూస్తున్నది. మళ్లీ కాంగ్రెస్ పార్టీని నమ్మే ప్రసక్తే లేదు. ఇప్పుడున్న ధరణితో ఢోకా లేదు. ధరణే బాగున్నది. మన భూమిని మనమే తప్పా.. వేరేవాళ్లు అమ్మలేరు. మనం పోయి వేలిముద్ర వేస్తే తప్పా పట్టాలో పేరుమారదు. రైతుబంధు, రైతుబీమా ఠంచన్‌గా వచ్చి పడ్తాయి. ఎలా ఆలోచించినా కష్టాల్లోకి నెట్టే కాంగ్రెస్‌కు ఓటేసేది లేదు.

**- బాల్‌రెడ్డి, రైతు, చిన్నమల్లారెడ్డి**





## ధరణి లేకపోతే ఇబ్బందే

తెలంగాణ రాకముందు ఉన్న పట్వారీ వ్యవస్థతో మా తాత, మా నాన్న చాలా ఇబ్బందిపడ్డారు. అప్పట్లో పహాణీ కావాలంటే తహసీల్ ఆఫీసు చుట్టూ చెప్పులరిగేలా తిరిగెటోళ్లమని నాయన చెప్పుతుండే. పట్వారీ ఉన్నప్పుడు పంట నష్టం జరిగినా, బ్యాంకు రుణం కోసం భూమిని రికార్డుల్లోకి ఎక్కియ్యాలన్నా చాలా ఖర్చు అవుతుండె. తెలంగాణ సర్కారు వచ్చినంక కేసీఆర్ సారు ధరణితో ఒక్క దగ్గరే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసి ఒక్క రోజులోనే పాసుబుక్కు ఇస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ధరణి మంచిదే. ధరణి లేకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్తరు.

**- కమ్మరి స్వామి, రైతు,చిన్నమల్లారెడ్డి**

## కాంగ్రెస్ వస్తే భద్రత కరువు

భిక్కనూరు, నవంబర్ 26: సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణి పోర్టల్ రైతులకు ఎంతో సౌకర్యంగా ఉన్నది. రైతులకు తెల్వకుండా అతని భూమి మరొకరికి మార్చే అవకాశమే లేదు. రైతు అనుమతితో మాత్రమే, తాను అమ్ముకుంటేనే అతని భూములు మరొకరి పేరుమీదికి మారుతాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి తీసేసి పాత పద్ధతిలో పట్వారీ వ్యవస్థను తెస్తే రైతులు మోసపోవాల్సి వస్తుంది. ఒక భూమిని చాలా ఏండ్లుగా సాగు చేసుకునే కౌలు రైతుల్లో ఎవరికైనా వక్ర బుద్ధి పుడితే రెవెన్యూ అధికారుల సహాయంతో పట్టాదారు కాలంలో తన పేరు ఎక్కించుకొనే ప్రమాదం ఉంటుంది. అప్పుడు అసలు పట్టాదారు ఇబ్బంది పడాల్సి వస్తుంది.

**- ప్రకాశ్‌బాయ్, రైతు, భిక్కనూరు**